# ఆశాజ్యోతి

అర్ధనిమీలిత నేత్రాలతో మురళిని పెదవుల వద్దవుంచి "కొలువు అమరెకదా కోదండపాణి..." అనే కీర్తన మెల్లగా మంద్రములో ఎత్తుకున్నాడు ప్రసాద్.

ఏదో తెలియని నూతన ఉత్సాహంతో మురళీ వాయిద్యంలో పూర్తిగా లీనమై షడ్జమంలో క్రొత్త స్వరాలు వేస్తూ అప్రయత్నంగా కళ్ళు తెరచి చూసేడు. ఎదురుగా నిల్చున్న అపరిచిత వ్యక్తిని చూసి గతుక్కుమన్నాడు. మురళీ నాదం ఆగిపోయింది.

"మిమ్మల్ని డిస్టర్బు చేసినందుకు క్షమించాలి" అన్నారాయన ప్రసాద్‌కు ఎదురుగా కూర్చుంటూ "మరేం పర్వాలేదండి" అన్నాడు ప్రసాద్ కొంచెం కంగారుగా "అదేమిటి కుర్చీ వుండగా నేల మీద కూర్చుంటున్నారు. యిలా ఈ కుర్చీలో కూర్చోండి" అంటూ టేబిల్ దగ్గర వున్న కుర్చీని ఆయన ప్రక్క జరిపేడు. ఆయన లేచి కుర్చీలో కూర్చున్నారు.

గ్లాస్కో పంచ, కోటు, కళ్ళకు రోల్డుగోల్డు ఫ్రేమ్ కళ్ళజోడు, అరశతమానం పై బడ్డ ఆ శ్రీమంతుడు ఎవరో ప్రసాద్‌కు ఎంత ఆలోచించినా అంతు చిక్కలేదు "అద్భుతంగా వాయించారు మిష్టర్ ప్రసాద్! 'తోడిరాగం' కదూ?" అన్నారు ఆయన చిరునవ్వుతో, ప్రసాద్ అవునన్నట్లు తలూపేడు. అతనికి తన పేరెలా తెలిసిందా? అని మరింత ఆశ్చర్యపోతూ.

"ఏదో కాలక్షేపానికి వాయించడం తప్ప నాకట్టే సంగీతం రాదండి" అన్నాడు కొంచెం సిగ్గుపడుతూ "ఈయన కొంపతీసి ఎవరైనా సంగీత విద్వాంసులు కారుకదా?" అనుకున్నాడు? "మిష్టర్ ప్రసాద్! మీ క్లాస్‌మేట్ మిస్ శ్యామల మా అమ్మాయి. రేపు మా అమ్మాయి బర్త్‌డే! ఏదో ఫ్రెండ్స్ నలుగురికీ చిన్న పార్టీ చేద్దామనుకుంటున్నా. మీరు తప్పకుండా రావాలి" అంటూ ఇన్విటేషన్ కార్డు యిచ్చేరు.

"థాంక్స్" అంటూ అందుకుని చూసేడు ఆయన పేరు 'రామశర్మగారా' అనుకున్నాడు..

"ఈమాత్రం దానికి మీరు శ్రమ తీసుకుని స్వయంగా రావాలా? ఎవరిచేతనైనా కబురు పంపుతే చాలుగా!" అన్నాడు ప్రసాద్ ఫ్లాస్కులో కాఫీ రెండు కప్పులలో పోసి ఒకటి ఆయనకిచ్చి రెండవది తను తీసుకున్నాడు.

"ఆఁ! శ్రమేంవుందండీ యిందులో, అయినా మా శ్యామల మీగురించి చాలా చెప్పింది. అందుకే నేనే స్వయంగా మిమ్మల్ని రిక్వెస్టు చేద్దామని వచ్చేను వచ్చినందుకు మీ మురళీ గానం వినేభాగ్యం లభించింది" అన్నారు చిరునవ్వుతో. "రా! పాపా! అక్కడే నిల్చున్నావేం?" అన్నాడు ప్రసాద్ గబగబా వచ్చి గుమ్మం దగ్గర ఆగిపోయిన ఆరేళ్ళ అమ్మాయితో.

పాప మెల్లగా అడుగులు వేసుకుంటూ వచ్చి ప్రసాద్ ఒళ్ళో కూర్చుంది. "మా యింటివాళ్ళమ్మాయి రాధ" అంటూ ఆయనకు పరిచయం చేసేడు ప్రసాద్. 'నమస్తే!......' అంది పాప చేతులు జోడించి. పాపను ఆశీర్వదిస్తూ ఆ అమ్మాయిలో గల సభ్యతకు ఆశ్చర్యపోయేడు.

"మిస్టర్ ప్రసాద్ రేపు మీరు తప్పకుండా వస్తారు కదూ! సాయంత్రం కారు పంపుతాలెండి" అంటూ లేచేరు. ప్రసాద్ అప్రయత్నంగా తలూపేడు ఆయన కారు స్టార్ట్ చేసి బయలుదేరే వరకూ గుమ్మంలో నిల్చున్నాడు. పాప ఆయనకు టాటా చెప్పింది.

రామశర్మగారిచ్చిన ఇన్విటేషన్ మరొక మారు చదివేడు. పార్టీకి వెళ్ళడమా? మానడమా ఎటూ నిర్ధారణ చేసుకోలేక ఆలోచిస్తూ యీజీ చెయిర్‌లో కూర్చునేసరికి పాప గొంతుక వినిపించింది. "ఏంటన్నయ్యా! మర్చిపోయేవా, యివాళ శుక్రవారం" "ఓ అవును కదూ! మనం మందిరానికి వెళ్ళాలిగా!" అన్నాడు ప్రసాద్ "ఊఁ! నేను రడియే!" అంది పాప గౌను సరిచేసుకుంటూ.

రూమ్‌కి తాళం వేసి పాప చెయ్యి పట్టుకుని రాధాకృష్ణమందిరానికి బయలుదేరేడు. రాధా కృష్ణుల విగ్రహాలను చూస్తుంటే ఒళ్ళు పులకరిస్తుంది. పూజా నంతరం తీర్థం ప్రసాదం పుచ్చుకొని యింటి కొచ్చేరు. రాత్రి భోజనమైన తరువాత చదువుదామని పుస్తకం తెరిచేడు ప్రసాద్. కాని అతని మనస్సు చదువు మీద లగ్నం కాలేదు. చంద్రబింబం లాంటి ముఖం, విశాలమైన నేత్రాలు, నొక్కులజుట్టు, శ్యామల రూపం అతని కళ్ళముందు ప్రత్యక్షమై చదువుకు అంతరాయం కల్గించింది. ప్రసాద్ పుస్తకం మూసి లైట్ ఆర్పి నిద్రపోయేడు.

మర్నాడు సాయంత్రం 5 గంటలకు రామశర్మగారు ప్రసాద్ కోసం కారు పంపేరు. ఇక వెళ్ళకపోతే బాగుండదేమోనని బయలుదేరేడు. "గుడ్ యీవినింగ్ మిస్టర్ ప్రసాద్" అంటూ గుమ్మంలో అడుగు పెట్టగానే వచ్చి రిసీవ్ చేసుకుంది శ్యామల. "విష్ యూ ఏ హేపీ బర్త్‌డే!" అన్నాడు. ప్రసాద్ కొంచెం జంకుతూ, చేతిలో వున్న పేకెట్ ఆమె కిచ్చేడు.

ప్రసాద్‌కు శ్యామలతో మాట్లాడ్డం యిదే మొదటిసారి. ఆడవాళ్ళతో మాట్లాడ్డమంటే తగని భయం అతనికి "లోపలకు వెళదాం రండీ, మీరు రారేమోనని భయపడ్డాను. కాని నాన్నగారి మాటను త్రోసివేయకుండా వచ్చినందుకు చాల సంతోషం" అంటూ ఇంట్లోకి

దారి తీసింది. ప్రసాద్ ఆమెను అనుసరించేడు.

"నాన్నగారు రాత్రి నుంచీ మీ మురళీ వాయిద్యాన్ని గురించి తెగపొగుడుతున్నారు" అంది శ్యామల. ప్రసాద్ సమాధానంగా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. రామశర్మ గారు ప్రసాద్‌ని విష్ చేసి మేడ మీదకు తీసికొని వెళ్ళేరు. అతిధుల్ని పరిచయం చేసారు.

"ఈయన చక్రధర్రావు నాబాల్య స్నేహితుడు, గొప్ప వయలిన్ విద్వాంసుడు. మెడ్రాస్‌లో సన్మానం జరుపుకొని తిరిగివస్తూ నన్ను స్టేషన్‌లో కలుసుకోమని టెలిగ్రామిచ్చేడు. ఉదయం స్టేషన్‌కి వెళ్లి బలవంతంగా తీసుకొచ్చేను" అంటూ అప్పుడే మేడ మీదకు వస్తున్న ఓ లావుపాటి ఆయనను కూడా ప్రసాద్‌కు పరిచయం చేసేరు. అక్కడి వాతావరణం ప్రసాద్ ఊహించినట్లు కాక మరోకలా వుంది. ఎవరో పెద్ద పెద్ద ఆఫీసర్లు వాళ్ల ఫేమిలీసు అంతా కలసి మొత్తం అరవంద మందుంటారు. వాళ్ళలో ప్రసాద్‌కు తెలిసిన వాళ్ళు ఒక్కరూ లేరు. అదీ ఒకందుకు మంచిదేనని ఆలోచిస్తూ వంటరిగా ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"ప్రసాద్ రండి మాయిల్లు చూద్దురుగాని" అంటూ శ్యామల పిల్చింది. ప్రసాద్ మౌనంగా ఆమెననుసరించేడు. "ఇది నాన్నగారి పూజామందిరం" అంటూ ఓ గదిలోకి దారి తీసింది. ప్రసాద్ గదిలో అడుగుపెట్టగానే అదిరిపడ్డాడు. ఎదురుగా నిలువెత్తు నటరాజ విగ్రహం ప్రక్కనే ముసుగుతో వున్న రెండు మృదంగాల్ని చూసి

"ఈ మృదంగాలు....." అన్నాడు ఆశ్చర్యపోతూ. "నాన్నగారివి......!" అంది శ్యామల. ప్రసాద్‌కు ప్రక్కలో బాంబే పడ్డట్టయింది. రామశర్మగార్ని గురించి తనూహించింది కొంత వరకూ నిజమేననుకున్నాడు. గోడ మీద పూల మాలలో అలంకరించిన రెండు తైలవర్ణచిత్రాల మీద పడింది అతని దృష్టి. ఒకటి పద్దెనిమిదేళ్ళ యువతి నాట్య భంగిమలో నిల్చున్నట్లున్నది. రెండవది నడివయస్కురాలు. అది మాఅక్కయ్యది. యిది అమ్మది అంటూ ఆగదిలోనుంచి బయటకు వచ్చింది.

శ్యామల క్రమంగా తనగది వాళ్ళ నాన్నగారి రీడింగు రూమ్ మిగతా గదులన్నీ చూపించింది. "మన క్లాస్‌మేట్స్, లెక్చరర్స్ ఎవరూ రాలేదేం!? అన్నాడు ప్రసాద్ "నాకు ఇటువంటి పార్టీలు అవి అంటే అట్టే సరదాలేదండి! ఏదో నాన్న గార్ని సంతోష పెట్టడానికి కాని. అయినా స్టూడెంట్స్ విషయం మీకు తెలియంది కాదుగా" అంది శ్యామల నవ్వుతూ.

"నాన్నగారికి నాట్యం సంగీతం అంటే గొప్ప అభిరుచి. అందుకే అక్కయ్యకు భరతనాట్యం నేర్పించేరు. అమ్మ చక్కగా పాడేది. కాని అక్కయ్య మశూచికం వచ్చి హఠాత్తుగా పోయింది. బెంగతో అమ్మ నెల రోజులు తిరక్కుండానే......" శ్యామల గొంతుకు జీరపోయింది. "మీ మనస్సు కష్టపెట్టినందుకు క్షమించాలి" అన్నాడు ప్రసాదు కంగారుగా. పదండి మనకోసం వాళ్లంతా వెయిట్ చేస్తున్నారు అంటూ శ్యామల మేడ మీదకు దారి తీసింది.

పార్టీ అనంతరం చక్రధర్రావుగారిని వయలిన్ వాయించమని కోరేరు రామశర్మగారు. "శర్మా! నువ్వు మృదంగం వాయిస్తే నేను వైలిన్ వాయించడానికేం అభ్యంతరం లేదు"

అన్నారు. అతిధులందరూ చక్రధర్రావు తీర్మానాన్ని బలపర్చేరు. రామశర్మగారు కాదన లేకపోయేరు. పూజా మందిరంలోవున్న మృదంగాన్ని తెప్పించేరు.

"నీతో వాయించేపాటి తాహతు లేదురా నాకు!" అన్నారు మృదంగాన్ని శృతిలో పెడుతూ చక్రధర్రావుగారు. "నగు మోము......" అనే పల్లవి ఎత్తుకున్నారు. 'రెండు మత్త గజాలు పోటీకి నిల్చాయా' అన్నట్లు వాళ్లిద్దరూ ఒకరి కొకరు తీసిపోకుండా రెండు గంటల కాలం శ్రోతల్ని తమ అసమాన ప్రతిభతో ఉర్రూత లూగించేరు. "శభాష్ శర్మా! నువ్వు నిండు కుండవిరా!" అన్నారు చక్రధర్రావుగారు. రామశర్మ గారు చిరునవ్వు నవ్వి వూరుకున్నారు.

అతిధులు వారిద్దరి ప్రజ్ఞను కొనియాడుతూ శలవు తీసుకొని వెళ్లిపోయేరు. 'ఇంత బెస్ట్ కాంబినేషన్ నాజీవితంలో చూడలేదు. అమోఘంగా వాయించేరు!" అన్నాడు ప్రసాద్. "మీ మురళీ గానం వినే భాగ్యం...." అన్నారు చక్రధర్రావు గారు. "ఆఁ! మీ విద్య ముందు నాదేపాటిది హనుమంతుడి ముందు కుప్పిగంతుల్లా వుంటుంది" "ఆహాఁ అలా అనకండి. ఎవరి విద్య వాళ్ళది" అన్నారు చక్రధర్రావుగారు రేపు మీరు మాయింటికి గెస్ట్‌గా రమ్మని నా ప్రార్ధన అన్నాడు ప్రసాద్ చేతులు జోడించి.

మీ మురళీగానం వినిపిస్తానంటే తప్పక వస్తాను అన్నారు చక్రధర్రావుగారు. "ప్రసాద్! నాదో చిన్న రిక్వెస్టు. రేపు ఆదివారం కాలేజీ కూడా లేదు కనుక మీరే మా యింటికి వస్తే అందరం సరదాగా ఎంజోయ్ చెయ్యొచ్చు" అన్నారు రామశర్మగారు. "అవును ప్రసాద్ నాన్నగారు చెప్పింది చాల బాగుంది. మీరు కాదనకండి.... ప్లీజ్ అంది శ్యామల ప్రసాద్‌ను బ్రతిమాలుతూ. ప్రసాద్ కాదనలేక పోయేడు.

మర్నాడుదయం ప్రసాద్ స్నానం చేసి బట్టలు మార్చుకుంటూంటే పాప వచ్చింది. "నిన్న సాయంత్రం ఎక్కడి కెళ్లేవన్నయ్యా" అని అడిగింది. "మాఫ్రెండ్ పుట్టినరోజు పార్టీకి" మొన్న కారులో ఒచ్చారు వాళ్ళింటికా?" ప్రసాద్ అవునన్నట్లు తలూపేడు. "మరి నా పుట్టిన రోజుకి భోజనానికి రమ్మంటే రాలేదేం?" అంది పాప బుంగమూతి పెడుతూ. చెళ్ళున కొట్టినట్లయింది ప్రసాద్‌కు ఆ పసి హృదయం అంతలా బాధపడుతుందనకో లేదు. "నాన్నగారితో బజారుకు వెళ్ళాలి వస్తా టాటా" అంటూ బయటకు పరిగెత్తింది.

"రండి ప్రసాద్ మీకోసం యింకా కారు పంపుదామనుకొంటున్నా" అన్నారు రామశర్మగారు. "ఆఁ! ఎందుకండీ ఏమంత దూరం కనుక" అన్నాడు ప్రసాద్. కాఫీ ఫలహారాలు పూర్తయిన తరువాత ప్రసాద్ మురళి తీసి "తెలియలేరు రామాభక్తి మార్గమును" అనే కీర్తన వాయించేడు.

పాట పూర్తవగానే చక్రధర్రావుగారు లేచి ప్రసాద్‌ను అమాంతంగా కౌగిలించుకున్నారు. "మీలో యింత విద్వత్తుందనుకోలేదు" అన్నారు. రామశర్మగారు సంతోషం శ్యామల ఆనందానికి అంతులేదు. సిగ్గుతో తలవంచుకుంది. మధ్యాహ్నం భోజనాలైన తరువాత ప్రసాద్ శలవు తీసుకొని బయలు దేరుతుంటే శ్యామల ఒక ఆల్బం తెచ్చి యిచ్చింది.

"అమ్మ, అక్కయ్య పోయిన తరువాత ఈ మూడు యేళ్ళ నుంచి నాన్నగారి ముఖంలో విచారం తప్ప సంతోషం చూళ్ళేదు. కాని మీరివాళ ఆయన విచారాన్ని పోగొట్టి సంతోష పెట్టగలిగారు. చాలా థాంక్స్" అంది. ప్రసాద్ యింటికి వెళ్ళి శ్యామల యిచ్చిన ఆల్బమ్ తెరిచేడు. కవరు పేజీ త్రిప్పగానే అదిరి పడ్డాడు.

"శ్రీ ప్రసాద్‌గార్కి ప్రేమ పూర్వకంగా..... శ్యామల" అని రాసివున్న దాన్ని చూసి అందులో సగానికిపైగా శ్యామల సిస్టర్‌వి డ్యాన్స్ ఫోటోలు మిగిలినవి శ్యామలవి. ప్రసాద్ ఆల్బమ్ చూస్తూ నిద్రపోయేడు. సాయంత్రం 5 గంటలకు పాప వచ్చి తలుపు కొట్టే వరకూ తెలివి రాలేదు.

"లోపలకు రావచ్చా! ప్రసాద్!?" అంది శ్యామల గుమ్మంలో నిల్చుని. "ఓ రావచ్చు...." అంది పాప 'అ' 'ఆ' లు దిద్దుతూ. శ్యామల లోపలికి వచ్చి చూసింది ప్రసాద్ కనిపించలేదు. పాప దగ్గరకు వెళ్ళి నిల్చుంది. పాప తలెత్తి శ్యామలను చూసింది. "అన్నయ్య కోసమా? కూర్చోండి స్నానం చేస్తున్నాడు" అంది. శ్యామల కూర్చుంది. "నీ పేరేంటి పాపా?" అంది. "రాధ. మేం యిప్పుడు సినీమాకు వెళ్తున్నాం తెల్సా!" అంది పాప. "ఎవరెవరూ" 'అన్నయ్య నేను....." "మరి నేనో?"

"గుడ్ యీవినింగ్...." అన్నాడు ప్రసాద్ కంగారుగా. శ్యామల తన రూమ్‌కి వస్తుందనుకోలేదు. ఆమె ఇక్కడకు రావడం ఎవరైనా చూస్తే అనవసరంగా రభస జరుగుతుందని భయపడ్డాడు. "వారం రోజుల నుంచి మీరు మాయింటికే రావడం మానేశారు. నాన్నగారే వద్దామనుకున్నారు. కాని ఆయనకు ఒంట్లో కొంచెం బాగులేదు. మీకు కోపం వచ్చిందేమోనని నాన్నగారు అనుకుంటున్నారు" అంది శ్యామల "అబ్బే అటువంటిదేం లేదండీ రేపు తప్పకుండా వస్తాను" అన్నాడు. ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోస్తూ ఒక కప్పు శ్యామలకు అందించేడు. ఇంకోటి తను తీసుకొన్నాడు.

"పాపకో!" అంది శ్యామల. 'పాప తాగదు' అన్నాడు "మీ కాలక్షేపానికి మంచి ఫ్రెండ్ దొరికిందే!" అంది శ్యామల నవ్వుతూ. ప్రసాద్ కూడా చిరునవ్వు నవ్వేడు. "అన్నట్లు పిక్చర్‌కి వెళ్తున్నారట ఏ పిక్చర్‌కి" ప్రసాద్ గతుక్కుమన్నాడు. "అబ్బే! లేదరడీ వూరకనే అన్నాను పాపతో" అన్నాడు. "ఊరకనే కాదు! నిజంగా వెళ్తున్నాం" అంది పాప.

శ్యామల ఫకాలున నవ్వింది. "సరే మిస్టర్ ప్రసాద్ రేపు మీ కోసం ఎదురు చూస్తూంటాం" అంది. "తప్పకుండా" అన్నాడు ప్రసాద్. "పాపను కూడా తీసుకురండి. ఏం పాపా మాయింటికి వస్తావా!" అంది శ్యామల పాపను ఎత్తుకొని. పాప ప్రసాద్ వైపు అమాయకంగా చూసింది "ఏం పాపా! వెళ్దామా" అన్నాడు 'నువ్వు కూడా వస్తే' అంది పాప.

ప్రసాద్ శ్యామలను గుమ్మం వరకూ సాగనంపి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. "మనం సినిమాకు వెళ్ళడం లేదూ" అని పాప జాలిగా అడిగింది. "వెళ్దామన్నానుగా" "మరి యిందాక ఆవిడతో లేదని చెప్పావు" పాప అమాయకత్వానికి నవ్వొచ్చింది. పిల్లల దగ్గర ఏరహస్యం దాగదు వాళ్ళది నిష్కల్మష హృదయం "నువ్వెందరితో అలా చెప్పకూడదు తెలుసా" అన్నాడు. పాప తలూపింది "మరి తొందరగా డ్రస్ మార్చుకొనిరా వెళదాం"

అన్నాడు. పాప ఒక్క గంతులో బయటకు వెళ్ళింది.

ప్రసాద్ శ్యామల స్నేహం రోజు రోజుకు అభివృద్ధి చెందుతోంది. ఒకర్నొకరు విడిచి ఒక్క క్షణమైనా ఉండలేక పోతున్నారు. తనలో కలుగుతున్న మార్పును ప్రసాద్ గమనించక పోలేదు. కాని ఎంత ప్రయత్నించినా తన మనస్సును స్వాధీన పర్చుకోలేక పోతున్నాడు.

"ప్రసాద్ మీరు అక్కడ అద్దెగదిలో వుండేకన్న యిక్కడకే వచ్చేయకూడదూ? యింత యిల్లుంది కదా!" అన్నాడు రామశర్మగారు ఎన్నో మార్లు ప్రసాద్‌తో. "ఆఁ! ఎందుకండీ నాకు అక్కడ చాలా సదుపాయంగానే వుంది" అనేవాడు. శ్యామలకు దూరంగా వుంటేనే చదువులో కాస్త శ్రద్ధచూపగల్గుతున్నాడు. ఆమె దగ్గర వుంటే అదికూడ సాగదు.

"రేపాదివారం సింహాచలం వెళ్ళాలని వుంది. మీరు కూడా వస్తారా" అంది శ్యామల ప్రసాద్‌తో. "ఏంటి గిరాకీ!" అన్నాడు ప్రసాద్ నవ్వుతూ "అబ్బే ఏంలేదు వూరకనే. మళ్ళీ మన ఎగ్జామినేషన్స్ వస్తున్నాయి. ఇంక తీరికుండదు... నాన్నగార్ని రమ్మంటే రాలేనన్నారు...." అంది. "ఒకే!" అన్నాడు.

ఆదివారం ఉదయం సింహాచలం కారులో బయలు దేరేరు. కారు కుదుపుకు చాల సార్లు శ్యామల శరీరం ప్రసాద్‌కు తగుల్తూ అతనిలో వింత కోరికల్ని సృష్టింపచేసింది. "కారు నేరుగా కొండ మీదకు పోనిద్దా" మన్నాడు ప్రసాద్. కాని శ్యామల అందుకు అంగీకరించలేదు మెట్ల మీద నడచి వెళ్దామంది. మెట్లు మీదుగా! కొండ ఎక్కుతూ చుట్టు ప్రక్కలవున్న మనోహర సుందర దృశ్యాలను ఫొటోలు తీసేరు.

శ్యామల సత్రవులో బట్టలు మార్చుకుని పట్టుచీర కట్టుకుంది. వెండి పళ్ళెంలో పూజా ద్రవ్యాలను పెట్టుకొని దేవాలయానికి బయలు దేరింది. "ఆహా అచ్చంగా రతీదేవిలా తయారయ్యావు! ఇంత భక్తితో బయలుదేరావు. ఆ వరాహలక్ష్మి నృసింహస్వామివార్ని ఏం కోరిక కోరాలని" అన్నాడు.

శ్యామల సిగ్గుతో తలవంచుకుంది. పూజ అయిన తరువాత తీర్థం ప్రసాదం పుచ్చుకొని సత్రవుకొచ్చేరు. "ఇంతకీ స్వామివార్ని ఏం కోరేవో చెప్పలేదు" అన్నాడు ప్రసాద్ నవ్వుతూ "ఏం కోరేవో మీరు చెప్పండి చూద్దాం" అంది శ్యామల కొంటెగా "చెప్తే ఏమిస్తావు!" మీరేదడుగుతే అదే!" "అంతపాటి శక్తి వుంటే యింత దూరం రాకనేపోదువు. స్వామీ నాపరీక్ష ఫస్టుక్లాసులో పేసైతే మళ్ళీవచ్చి దర్శనం చేసుకుంటాను అని వుంటావు"

'ఛీ పొండి! నేనంత తెలివితక్కువ దాన్ని గాదు' అంది గోముగా. అయితే చెప్పు మరేం కోరేవో! అన్నాడు చిరునవ్వుతో. "ప్రసాద్ నేనొకటి అడుగుతాను నిజం చెప్తారా?" అంది శ్యామల ప్రసాద్ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ. మరెప్పుడైనా అబద్ధం చెప్పేనా? ఛీపొండి! మీరెప్పుడూ యింతే! అంటూ బుంగమూతి పెట్టింది.

"మీరు నన్ను ప్రేమిస్తున్నారా!" ఎన్నాళ్ళ నుంచో అడగాలనుకున్న ప్రశ్న ఆరోజు సిగ్గువిడిచి అడిగింది శ్యామల. "ఆవిషయాన్ని నాహృదయాన్ని అడుగు ఎంతలా నిన్ను ఆరాధిస్తున్నానో" "నిజంగానా!? నాకన్యాయం చేయకండి" "ముమ్మాటికి నిజం

శ్యామల! అవరాహ లక్ష్మీనృసింహస్వామి వారి సాక్షిగా నేను నిన్ను తప్ప మరొకర్ని పెళ్ళాడను" అన్నాడు ప్రసాద్ ఉద్రేకంగా. శ్యామలను తన దగ్గరకు తీసుకొని తన వ్రేలి వుంగరం తీసి ఆమె వ్రేలికుంచేడు. శ్యామల తన వ్రేలి వుంగరాన్ని తీసి ప్రసాద్ వ్రేలికి వుంచింది. 'ఇవే మన జీవిత బంధాలు" అన్నాడు ప్రసాద్. శ్యామల ప్రసాద్ పాదాలకు వంగి నమస్కరించింది. ప్రసాద్ ఆమెను లేవనెత్తి దగ్గరకు తీసుకొన్నాడు.

ప్రసాద్ చాల ఉషారుగా వున్నాడు. ఆరోజుతో ప్రాక్టికల్స్ కూడా పూర్తయిపోయాయి. తల మీదనుంచి పెద్ద బరువు దించినట్టయింది. గత నెల రోజుల నుంచి పరీక్ష గొడవల్లోపడి శ్యామలను నాలుగైదు సార్లు కల్సుకొని మాట్లాడ్డం జరిగింది. రామశర్మగారు తరచు ప్రసాద్‌ను కల్సుకొంటూ శ్రద్ధగా చదవమని హెచ్చరిస్తూండేవారు. శ్యామల ఇంటికి వెళ్ళా లని ప్రసాద్ స్నానం చేసి బట్టలు మార్చుకుంటూంటే

"టెలిగ్రాం సార్" అన్నకేక వినిపించింది. సంతకం చేసి వణుకుతున్న చేతుల్తో విప్పేడు 'మదర్ సీరియస్ స్టార్ట్ ఇమిడియట్లీ" అంటూ ప్రసాదుకు వాళ్ళ మామయ్య సీతా రామయ్యగారు యిచ్చిన మెసేజ్ చదివి కుప్పలా కూర్చుండి పోయేడు.

క్షణకాలం ఏం చెయ్యాలో తోచలేదు. టైమ్ చూసేడు. అరగంటలో వాళ్ళవూరు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ వుంది. అదితప్పితే మర్నాటి ఉదయం పది గంటల వరకూ మరే ట్రైన్ లేదు. గబగబ బట్టలూ సామాన్లు సర్దుకుంటున్నాడు. "ప్రసాద్ ఏదో టెలిగ్రాం! అన్న కేక వినిపించింది. మరేం అర్జంటు లేదుకదా!" అంటూ యింటి ఓనరు వచ్చేడు "మా అమ్మగారికి సీరియస్‌గా ఉందండి" అంటూ ప్రసాద్ టెలిగ్రాం ఆయన కిచ్చేడు.

"అరే పాపం ట్రైన్ టైము కూడా అవుతూందే! ఉండు నేను కూడా హెల్పు చేస్తాను" అంటూ ఆయన సామాన్లు సర్దేరు. ప్రసాద్‌తో కూడా స్టేషన్‌కి వెళ్ళేరు. "నువ్వు మరేం కంగారు పడకోయ్ మీ అమ్మగార్కి త్వరలోనే నయమవతుంది. ఇంటికి చేరగానే వెంటనే లెటర్ రాయి" అన్నారాయన ట్రెయిన్ కదుల్తూంటే. ప్రసాద్ మౌనంగా తలూపి ఆయనకు నమస్కరించేడు.

టెలిగ్రాం తీసి మరొకమారు చదివేడు. మామయ్య తనకు టెలిగ్రాం ఇవ్వడం చూసి ఎంతైనా ఆశ్చర్యపోయేడు. పది సంవత్సరాల క్రిందటి సంఘటన గుర్తుకొచ్చింది. తన తండ్రి పోయాక అమ్మకు మావయ్యకు ఏదో మాట మీద మాటవచ్చి అమ్మ ఎంత బ్రతిమాలుతున్నా వినకుండా ఎనిమిదేళ్ళకూతురు శాంతను తీసుకొని వాళ్ళ వూరు వెళ్ళిపోయేడు మామ్మయ్య. అత్తయ్య చనిపోతూ శాంతను అమ్మ చేతుల్లో పెట్టి కళ్ళు మూసింది. శాంత యిప్పుడు ఎలా వుందో తనను గుర్తిస్తుందో లేదో అనుకున్నాడు ప్రసాద్.

రైలు ఒక్కొక్క స్టేషన్ దాటుకుంటూ మహావేగంగా ముందుకు పోతోంది. అతనికి అకస్మికంగా శ్యామల జ్ఞాపకానికొచ్చింది. "పాపం శ్యామల తన కోసం సాయంత్రం నుంచీ ఎదురుచూస్తుంది. సాయంత్రం పిక్చర్ ప్రోగ్రాం కూడా వేసుకున్నాం. ఆమెతో తను ఈ విషయం చెప్పడానిక్కూడా టైమ్ లేక పోయింది." అంటూ ఎంతో విచారించేడు. ఇంటికి

వెళ్ళగానే పరిస్థితులు చూసి వెంటనే శ్యామలకు లెటర్ రాయాలనుకున్నాడు.

ప్రసాద్ తనయింటి ముందు చేరిన జనాన్ని త్రోసు కుంటూ లోపల అడుగు పెట్టేడు. ఎదురుగావున్న దృశ్యాన్ని చూసి కంపించిపోయేడు. "అత్తయ్యా!" అంటూ శాంత ప్రసాద్ తల్లి మీదపడి ఏడుస్తూంది. ప్రసాద్ మామయ్య సీతారామయ్యగారు ప్రక్కనే మోకాళ్ళ మీద తల పెట్టుకొని కూర్చున్నారు.

"అమ్మా!" అంటూ ఒక్క అరుపు అరచి తల్లి మీదపడి బావురుమన్నాడు ప్రసాద్. "బావా! అత్తయ్య మనల్ని విడిచి వెళ్ళిపోయింది" అంటూ మరింత గట్టిగా ఏడవడం మొదలు పెట్టింది శాంత. సీతారామయ్యగారూ, చుట్టూ చేరిన జనం వారిరువురినీ సముదాయించడానికి ఎంతో ప్రయత్నించారు.

తల్లి అంత్యక్రియలు జరిపి యింటి కొచ్చేసరికి మధ్యాహ్నం మూడు గంటలయింది. ప్రసాద్‌కు ప్రపంచమే అంధకారమయింది. "తండ్రిలేని లోటు తీరుస్తూ యిన్నాళ్ళూ తనను కంటికి రెప్పలా కాపాడిన తల్లి తనతో కనీసం ఒక్క మాటైనా చెప్పకుండా ప్రపంచాన్ని విడిచి వెళ్లిపోయిందని" విచారిస్తూ కూర్చున్నాడు.

"బావా! భోజనానికిరా" అంటూ శాంత పిల్చింది ప్రసాద్‌ని. ప్రసాద్ చలించలేదు మౌనంగా కూర్చున్నాడు. "రాత్రి కూడా ఏం తిననట్లు లేదు. లే బావా?" అంటూ శాంత బలవంతం చేసేసరికి ప్రసాద్ విధిలేక లేచి వెళ్ళి ఏదో రెండు మెతుకులు ఎంగిలిపడ్డాడు. పన్నెండో రోజున ప్రసాద్‌ని వాళ్ళ మామయ్య పిల్చి చెప్పేడు.

"నక్షత్రం మంచిదికాదు ఆరు మాసాల వరకూ యిల్లు విడిచి పెట్టాలంటున్నారు" అని. ప్రసాద్‌కు తల మీద పిడుగు పడ్డట్లయింది. "ఆరు మాసాలేంటి శాశ్వతంగావే విడిచి పెట్టేస్తాను. అమ్మలేని ఈ యింట్లో నేను ఒక్కక్షణమైనా యిక వుండలేను" అన్నాడు ప్రసాద్. "కావలసిన సామానేదో తీసుకో దీపాలు పెట్టేలోపల బయలుదేరాలి" అన్నారు సీతారామయ్యగారు. ముఖ్యమైన సామాను సర్ది బండికి ఎక్కించేరు.

"శాంత, నేనూ కూడా నీతో వద్దామనుకుంటున్నాం కాశీకి. మీ అత్తయ్య పోయిన తరువాత నేనసలు వెళ్ళేలేదు" అన్న సీతారామయ్యగారి మాటలకు ఎంతో సంతోషించేడు ప్రసాద్. 'తన తల్లి అస్థికలు గంగా నిమజ్జనం చేయడానికి తను వంటరిగా బయలుదేరా లనుకున్నాడు' కాని శాంత మామయ్య కూడా బయల్దేరుతున్నారనగానే ప్రసాద్‌కు కొంత నిబ్బరం కల్గింది.

"అరుణాచలం అని మాఫ్రెండొకాయన కాశీలో వున్నాడు ఆయనికి మనం వస్తున్నట్లు టెలిగ్రామిచ్చేను. ఆయన మనకన్ని సదుపాయాలూ చేస్తారు" అన్నారు సీతారామయ్యగారు. అనుకున్నట్లే అరుణాచలంగారు స్టేషన్‌కు వచ్చి రిసీవ్ చేసుకొని వాళ్ళింటి దగ్గర బసేర్పాటు చేసేరు. ప్రసాద్ తన తల్లి అస్థికలు గంగా 'నిమ్మజ్జనం' చేసి గయా ప్రయాగ తిరిగి వచ్చిన మర్నాడు, తమ తిరుగు ప్రయాణానికన్ని ఏర్పాటు చేసేరు.

బయల్దేరే సమయానికి సీతారామయ్యగారు హఠాత్తుగా గుండెల్లో నొప్పి వచ్చి పడిపోయేరు. అరుణాచలంగారు వెంటనే డాక్టరు కోసం పరిగెత్తేరు "నాన్నా!" అంటూ

శాంత 'మామయ్యా!' అంటూ ప్రసాద్ ఆయనకు చెరో ప్రక్క చేరేరు. "ప్రసాద్ నా జీవితంలో చివరి ఘడియలు దగ్గర కొచ్చేయి...." సీతారామయ్యగారి గొంతుక బొంగుర పోయింది 'నాన్నా' అంటూ శాంత బావురుమంది. ప్రసాద్‌కు ముచ్చెమటలూ పోసేయి. "అవేంమాటలు మామయ్యా! శాంత భయపడుతుంది వూరుకో" అన్నాడు ప్రసాద్.

"లేదు ప్రసాద్ నేనింక అట్టేసేపు బ్రతకను. ఈ చివరి ఘడియల్లో... శాంతను నీచేతులలో పెడుతున్నా... దాని కన్యాయం చేయకు.... మీఅమ్మ అంతిమ సందేశం కూడా యిదే.... నాకు మరేకోరిక లేదు. నువ్వు మాటయిస్తే.... నిశ్చింతగా నేను"... అంటూ సీతారామయ్యగారు శాంత చేయి ప్రసాద్ చేతిలో వుంచేరు. "మామయ్యా అమ్మ తుదికోరిక నేతప్పక తీరుస్తాను. నేను అనే మాటలు ప్రసాద్ నోటంట అప్రయత్నముగా వచ్చేయి.

సీతారామయ్యగారు ఏదో చెప్పాలని నోరు తెరిచారు. కాని ఆయన నోటంట మాట రాలేదు. ఎత్తిన చేయి ఎత్తినట్లే జారి క్రింద పడిపోయింది. ప్రసాద్ శాంత గొల్లుమన్నారు. అరుణాచలంగారు డాక్టర్ గారితో పరుగు పరుగున వచ్చి అక్కడి పరిస్థితి చూసి నిలువునా నీరయ్యేరు. వాళ్ళిద్దరినీ ఎన్నో విధాల వోదార్చి మిత్రుడి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసేరు అరుణాచలంగారు.

పన్నెండు రోజులైన తరువాత ప్రసాద్ శాంతను తీసుకొని బయలుదేరేడు శాంత వాళ్ళవూ రు. "నాయనా ప్రసాద్ శాంత యింకా చిన్న పిల్ల. అనుభవం ఎరుగదు. ఆమె మనస్సు కష్టపెట్టకు " అంటూ కళ్ళొత్తుకున్నారు. అరుణాచలం గారు రైలు కదుల్తోంటే ప్రసాద్ ఆయనకు నమస్కరించేడు.

శాంత తలుపు తాళం తీసింది. ప్రసాద్ సామానంతా యింట్లో పెట్టించేడు. వాళ్ళిలా యింట్లో అడుగు పెట్టగానే వూరంతా గుమిగూడారు యింటి ముందు.

"ఎంత పని జరిగింది! చిన్న పిల్లలు మిమ్మల్ని అనాధల్ని చేసి వెళ్ళిపోయారా! మీముద్దు ముచ్చట చూడకుండా... ఎంత ఘోరం జరిగింది... ఎంత ఘోర వార్త విన్నాం!" అంటూ ఒక్కొక్కరే ప్రసాదును పరామర్శిస్తూ, శాంతను ఓదారుస్తున్నారు. ప్రసాదు మోకాళ్ళలో తలపెట్టుకొని అచేతనంగా కూర్చున్నాడు. అతనికి ప్రపంచమే అంధకారమైంది. అటు కన్న తల్లి యిటు మేనమామ యిద్దరూ ఈలోకం విడిచి వెళ్ళిపోయేరు.

"చూడు ప్రసాదు మొగవాడివి నువ్వు యిలా అధైర్య పడితే శాంత మరీ బెంబేలు పడిపోతుంది. లేచి కొంచెం ధైర్యంగా వుండి ఆమెకు ధైర్యం చెప్పాలి కాని. మనిషైన వాడికి కష్టాలు వస్తాయి. ఇది లోకసహజం వాటిని ధైర్యంగా ఎదుర్కోవడం ధైర్యవంతుల లక్షణం వాటికి మనమెన్నడూ లొంగిపోకూడదు లే లే...." ఆ అమృత వచనాలకు ప్రసాద్ కొంచెం చలించేడు. ఆ సహృదయులెవరాని తలెత్తి చూసేడు.

ఎదురుగా శ్రీనివాస్‌గారు కనిపించేరు. "బావా!" అంటూ బావురుమన్నాడు ప్రసాదు ఆయన్ని పట్టుకొని. ఎంత ప్రయత్నించినా దుఃఖాన్ని ఆపుకోలేక పోయేడు ప్రసాదు. శ్రీనివాస్‌గారి తల్లి సుందరమ్మ ప్రసాదు తల్లి కామేశ్వరమ్మ మేనత్తమేనమామ పిల్లలు. "ప్రసాదు

మేమంతా ఉండగా నీకేం భయంలేదు వూరుకో. కాస్త ధైర్యంగా వుండి శాంతను ఓదార్చడానికి ప్రయత్నించు" అంటూ శ్రీనివాస్‌గారు ప్రసాదును సముదాయించేరు. "ఆచావేదో నాకొచ్చింది కాదు! ఆ దేవుడు నన్ను తీసుకుపోయాడు కాదు!.... నీముద్దూ ముచ్చట చూడకుండా ఆమూడు ముళ్ళు పడకుండా నీకెంత అన్యాయం జరిగింది!" అంటూ నట్టింట్లో శాంతను పట్టుకొని ఏడుస్తున్న సుందరమ్మను శ్రీనివాస్‌గారు కేకలేసి వూరుకో పెట్టేసరికి తలప్రాణం తోకకు వచ్చింది.

★ ★ ★

"సాయంత్రమైనా ఏమిటి బావా! యీ మొద్దు నిద్ర లేలే! నీకో గుడ్‌న్యూస్!?" అంటూ ప్రసాదును కుదిపి లేపింది శాంత. ప్రసాదు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని కళ్ళు తెరిచేడు. చిరునవ్వు నవ్వుతూ ఎదురుగా వున్న శాంతను చూసి క్షణకాలం నివ్వెరపోయేడు. తను గత నెలరోజుల్నుంచీ శాంతను చూస్తున్నా అంత అందంగా వుంటుందనుకోలేదు. బావ తనవేపు అదోలా చూడ్డంతో శాంతకు ఎక్కడలేని సిగ్గు వచ్చింది. చప్పున తల దించుకుంది.

"ఏమిటంతలా పొంగిపోతున్నావు?" అన్నాడు ప్రసాద్ మంచం దిగుతూ "నువ్వు ఫస్టుక్లాసులో పాసయ్యావు తెలుసా" "నిజం.....!?" అన్నాడు ప్రసాదు ఆశ్చర్యం.... "ఇదుగో బావా! పేపరు చూడు" అంటూ పేపరు అందించింది. ప్రసాదు పేపరు చూసి సంతోషంతో శాంత రెండుచేతులూ పట్టుకొని ఒప్పుల కుప్పలా తిప్పాడు. శ్రీనివాస్ "బావకు చెప్పొస్తా" నంటూ వీధిలోకి పరిగెత్తేడు కాని ఎదురుగా "శాంతా!" అంటూ గబ గబ అడుగులు వేసుకొస్తున్న శ్రీనివాస్‌గార్ని చూసి మధ్యలో ఆగి పోయేడు.

"కంగ్రాట్యులేషన్సు బావా!" అంటూ శ్రీనివాస్‌గారు ప్రసాద్‌కు షేకేండిచ్చేరు "కంగ్రాట్యులేషన్సు శాంతా! నువ్వు మెట్రిక్ ప్యాసయ్యావు! యిదిగో టెలిగ్రాం మా ఫ్రెండొకాయన పంపేడు" అంటూ తన చేతిలోవున్న టెలిగ్రాం శాంతకు యిచ్చేరు. "అమ్మదొంగా! నువ్వు మెట్రిక్ వెళ్లినట్లు నాకసలు చెప్పనేలేదేం!" అంటూ శాంత చేతిలోవున్న కాగితం లాక్కున్నాడు ప్రసాద్. "లేదు బావా! అన్నయ్య నన్ను బలవంతంగా కట్టించేడు...."

"ఏవిట్లా అంత సంతోషంగా గెంతుతున్నారు!?" అంటూ సుందరమ్మగారు వచ్చేరు.

"అమ్మా! బావ బియస్సీ ఫస్టుక్లాసులో ప్యాసయ్యేడు. శాంత మెట్రిక్ ప్యాసయింది" అన్నారు శ్రీనివాస్‌గారు సంతోషంతో "మా నాయనే!... మా అమ్మే!" అంటూ సుందరమ్మగారు యిద్దర్నీ హృదయానికి హత్తుకున్నారు. "రాత్రికి నువ్వేం వండుతావ్ తల్లీ! మీరిద్దరూ మా యింటికి భోజనానికి వచ్చేయండి" అన్నారు సుందరమ్మగారు ఆప్యాయంగా. "అవును బావా! రాత్రి మా యింట్లో డిన్నర్" అన్నారు శ్రీనివాస్‌గారు "నాకింకా బోల్డుపనుంది వస్తానర్రా!" అంటూ వెళ్ళిపోయేరు సుందరమ్మగారు ప్రసాద్

పేపరు తీసి తన నెంబరూ శ్యామల నెంబరూ చూసి ఎంతో సంతోషించేడు.

"ఏం నాన్నా! ప్రసాద్ కనిపించారా? ఏమన్నారు మీతో తీసుకురాలేదేం?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది శ్యామల తండ్రి గుమ్మంలో అడుగు పెట్టగానే. "లేదమ్మా తల్లిపోయిన పన్నెండో నాడే ఎక్కడికో వెళ్ళిపోయాట్ట. నక్షత్రం మంచిది కాదు ఆరునెలలు యిల్లు వదలి పెట్టాలిట. చాలా సామాన్లు కూడా తీసుకెళ్ళేడన్నారు. అంటూ రామశర్మగారు ఉసూరుమని కుర్చీలో కూర్చున్నారు. "పోనీ యిరుగు పొరుగు వాళ్ళని అడుగలేక పోయారా? ఎక్కడి కెళ్ళేరో!"

"అడాగేనమ్మా కనిపించిన వాళ్ళందర్నీ అడిగేను. కొందరు రామేశ్వరమన్నారు. కొందరు కాశీ అన్నారు. కొందరేమో గయో ప్రయాగో అన్నారు. ప్రసాద్ వస్తే చెప్పమని మన ఎడ్రస్ యిచ్చి వచ్చేను" అన్నారు రామశర్మగారు. శ్యామల కళ్ళు చెమ్మగిల్లేయి. గబ గబ మేడ మీదకు వెళ్ళి పోయింది. రామశర్మగారు ఆమె వెళ్ళిన వేపు చూస్తూ ఒక్క దీర్ఘశ్వాస తీసి వదిలేరు.

"బాబుగారు తవర్నెమొ అయిగోరోసుట్టు దయసేయమన్నారండి" అన్నాడు ప్రసాద్ నుద్దేశించి ఎవరో పాలికాపు చేతులు జోడించి. "నన్నా! ఎవరు మీ అయ్యగారు" అన్నాడు ప్రసాద్ ఆశ్చర్యంగా "భుజంగరావుగారండి" చూడు నువ్వేదో పొరపాటుపడి వుంటావు నన్నుకాదు పిలవమంది, అన్నాడు ప్రసాద్ ఒక్క నిముషమాలోచించి. "నేదు బాబూ పెసాద్ బాబు తవరేగదా! శాంతమ్మగోరి బావగోరు. తవర్నే పిల్సుకు రమ్మన్నారు" అన్నాడు కచ్చితంగా ప్రసాద్ ఎంత ఆలోచించినా ఆ భుజంగారా వెవరో అర్థం కాలేదు. తనకు తెలిసిన వాళ్ళలో ఆ పేరుగల వాళ్లెవరూ లేరు. పోనీ చూద్దామనుకున్నాడు.

"సరే వుండు బట్టలు మార్చుకునివస్తా" అని లోపలకు వెళ్ళి బట్టలు మార్చుకున్నాడు. రెండైంది బయట ఎండ ఎక్కువగా వుంది. శాంత ఇంకా నిద్రనించి లేవలేదు. అనవసరంగా ఎందుకు లేపడమని సుందరమ్మగార్తో అలా వీధులోకి వెళ్ళి వస్తా తలుపు దగ్గరగా వేసివుంది కాస్త చూస్తూండుండని చెప్పి భుజంగరావుగారింటికి బయలుదేరేడు. భుజంగరావుగా రిల్లు వూరికి చివరగా వుంది. పెద్ద మేడ, ముందు పెద్ద వాకిలి, రకరకాల పూల మొక్కలు.

'రావోయ్! ప్రసాద్ రా! కూర్చో నేనే వద్దామనుకుంటున్నా కాని యీ మధ్య నా ఆరోగ్య మొకటి సరిగాలేదు" అన్నారు ఓ ఏభై ఏళ్ళ పై బడ్డ వ్యక్తి సోఫాలో కూర్చుని. ఆయనే భుజంగరావుగారనుకుని నమస్కరించేడు. ఆయన కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. "చిన్నతనంలోనే పాపం నీకు పెద్ద కష్టమొచ్చింది. అటు తల్లి పోవడం యిటు మేనమామ పోవడం. కష్టాలన్నీ ఒక్కమారే కట్టుకట్టుకొస్తాయి, ఏం చేస్తాం!" అన్నారు సానుభూతిగా.

"నువ్వు కామేశ్వరమ్మ కొడుకువికదూ! అదే నేనలాగే అనుకున్నాను మోహం చూడగానే ఆకళ్ళూ, ముక్కూ, నోరూ అంతా తల్లిపోలికే, పాపం! అకస్మాత్‌గా పోయింది. నీ ముద్దూముచ్చట చూడకుండానే" అంటూ ఒగర్చుకుంటూ ఓ లావుపాటావిడ వచ్చి భుజంగరావుగారి ప్రక్కనే చతికిలబడింది. ప్రసాద్ ఆమెను వొకమారు చూసేడు బహుశా ఆవిడ భుజంగ రావుగారి సతీమణి కాబోలనుకున్నాడు. అతని వూహ నిజమైంది ప్రసాద్

వారిస్తున్నా వినకుండా భుజంగరావుగారు వంట మనిషిని కేకేసి కాఫీ ఫలహారాలు తెప్పించేరు.

"మేమేం పరాయివాళ్ళం కాదోయ్ తీసుకో" అంటూ బలవంతం చేసేరు "రా అమ్మారా! మా అమ్మాయి లీల యితను ప్రసాద్ మన బంధువులే, శాంత నీకు తెలుసుగా! వాళ్ళ బావ! మొన్ననే బియస్సీ ఫస్టుక్లాసులో పాసయ్యేడు" అంటూ అపుడే మేడ దిగి వస్తున్న ఓ కుసుమకోమలిని ప్రసాద్‌కు పరిచయం చేసేడు. "నమస్తే, శాంత మెట్రిక్‌కి వెళ్ళింది కాబోలు? ఏంటయింది?" అంది లీల ప్రసాద్ ప్రక్కనే ఖాళీగావున్న మరో కుర్చీలో కూర్చుంటూ.

"పాసైంది" అన్నాడు ప్రసాద్ ఆమెను అపాదమస్తకం ఓమారు చూసి. "తీసుకోండి కాఫీ చల్లారిపోతుంది" అందామె చిరునవ్వు నవ్వుతూ. ప్రసాద్ కాఫీని ఒక్క గుక్కలో ఖాళీ చేసి కప్పును టీపాయ్ మీద వుంచేడు, పంచదార వేయడం మర్చిపోయేరు కాబోసు! అనుకుంటూ. "ఏం చేద్దామనుకుంటున్నావోయ్" అన్నారు భుజంగరావుగారు చుట్ట వెలిగించుతూ.

"అంటే..." "అదే! నీ చదువు విషయం? ఎ.ఎమ్మెస్సీనా, బి.యి లేక మెడిసినా..." "ఇంకా ఏదీ డిసైడ్ చేసుకోలేదండీ" అన్నాడు. "మీ అమ్మ నిన్ను డాక్టరు చదివిస్తాననేది! అదేదో చదవకూడదూ...!" అంటూ దీర్ఘం చేసిందా లావుపాటావిడ. ప్రసాద్ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

"శాంత కంటిన్యూ చేస్తుందా...లేక ...."అంది లీల. 'ఏమో తెలియదు' అన్నాడు క్లుప్తంగా. "చూడు ప్రసాద్ ఎందుకైనా మంచిది నాలుగింటికీ వెంటనే అప్లికేషన్సు పడేయ్ తరువాత ఆలోచించుకోవచ్చు" అన్నారు భుజంగరావుగారు. అలాగే అంటూ లేచాడు. మా యిల్లు చూద్దురుగాని రండి అంది లీల. ప్రసాద్ కాదనలేక ఆమె వెంట యిల్లంతా తిరిగొచ్చేడు. తరుచు వస్తుండవోయ్ అన్నాడు భుజంగావుగారు నవ్వుతూ ప్రసాద్ సరేనని శలవు తీసుకొని యింటికి బయలుదేరేడు.

"ఎక్కడికెళ్ళావు బావా! యింత ఎండలో" అని అడిగింది శాంత గుమ్మంలో అడుగు పెట్టగానే. "భుజంగరావు గారింటికి" బుజంగరావు గారింటికా" అంది శాంత ఆశ్చర్యంగా "అవును ఏం?" అన్నాడు. శాంత అంతలా ఆశ్చర్యపోవడానికి గల కారణం ఏమిటో అతనికి అర్థం కాలేదు. అడిగి తెల్సుకుందామనుకున్నాడు. కాని ఆమె ముఖం చిన్నబోయి వుండడం చూసి వూరుకున్నాడు. కాఫీ చల్లారిపోతోంది రా బావా అంది శాంత తను యిప్పుడే కాఫీ త్రాగేనని చెప్పాలను కున్నాడు... కాని

ప్రసాద్ ..... అంటూ శ్రీనివాస్‌గారు రావడం చూసి వూరుకున్నాడు. ఎండలో ఎక్కడికెళ్ళావోయ్ అన్నారు నవ్వుతూ. "భుజంగరావు గారింటికట" అంది శాంత రెండు కప్పుల్తో కాఫీ తెచ్చి ఒకటి ప్రసాద్‌కి రెండోది శ్రీనివాస్‌గారికిస్తు. "ఆఁ! భుజంగరావుగారింటికా! నీకెలాలాతెల్సాయన" ఏమో తెలియదు కబురు పంపితే వెళ్ళేను అన్నాడు. తను భుజంగరావు గారింటికి వెళ్తే వీళ్ళంతా ఎందుకిలా ఆరా తీస్తున్నారో ప్రసాద్‌కు అంతుచిక్కలేదు. కాఫీ

త్రాగుతూంటే పలమారి ఉక్కిరిబిక్కిరయ్యాడు.

ప్రసాద్‌కు గత రెండు రోజుల నుంచీ మనస్సేమీ బాగులేదు. ఏపని చేద్దామన్నా ఉత్సాహంగా లేదు. కారణం శ్యామలకు అతడు ఉత్తరం రాద్దామని ఎన్నోసార్లు ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఉత్తరం రాయడానికి అతని మనస్సు ఒప్పుకోలేదు ఆరోజు సాయంత్రం శ్రీనివాస్‌గారి కోసం చూసేడు. కాని ఆయన వూరు కెళ్ళిన విషయం గుర్తురాగానే ఒంటరిగానే షికారుకి బయల్దేరేడు.

"హల్లో మిస్టర్ ప్రసాద్ గుడ్ ఈవినింగ్!" అంటూ ఏటిగట్టున లీల ప్రత్యక్షమైంది పల్చటి నైలాన్ చీర, లేడీషూ చేతిలో చిన్న ట్రాన్సిస్టరు - ప్రసాద్ కూడా విష్ చేసేడు "షికారుకేనా! పదండి నేనూ వస్తున్నాను" అంది లీల. ఏటి గట్టు దిగి యిసుకలో మెల్లిగా నడుస్తున్నారు. "ఏమిటివాళ యింత డల్‌గా వున్నారు?" అంది లీల నవ్వుతూ. "అబ్బే ఏం లేదు....!" అన్నాడు ప్రసాద్‌నవ్వడానికి ప్రయత్నిస్తూ. "యిక్కడ బాగుంది కూర్చుందామా?" అంటూ యిసుకలో చతికిల పడ్డాడు.

ఆమె కూడా అతనికి దగ్గరగా కూర్చుంది. ట్రాన్సిస్టర్ ఆన్ చేసేసరికల్లా ఎవరిదో గాత్రం వస్తోంది. లీల ఆ స్టేషన్ మార్చి సిలోన్ పెట్టింది. "ఇందాక స్టేషన్ పెట్టండి మంచి పాట" అన్నాడు ప్రసాద్ సన్నంగా ఒదిగి ఒదిగి ప్రవహిస్తున్న నీటిపాయను చూస్తూ. లీల రెండు మూడు సార్లు ట్రై చేసింది. కాని ఆ స్టేషన్ దొరకలేదు. "మీరు ట్రై చేయండి" అంటూ ట్రాన్సిస్టర్ అందించింది. ప్రసాద్ ట్రై చేసి ఆస్టేషన్ పెట్టి వాల్యూమ్ హెచ్చించేడు. పాట వినడంలో పూర్తిగా లీనమయ్యాడు మెల్లగా కళ్ళు మూసుకొని.

లీల ఒంటరితనం భరించలేక ఒకటి రెండు మార్లు అతన్ని పలుకరిద్దామని అనుకుంది. కాని అతన్ని డిస్టర్బ్ చెయ్యడం యిష్టంలేక మౌనంగా కూర్చుంది. ఇంచు మించు అరగంట గడిచిన తరువాత పాట పూర్తవగానే ప్రసాద్ చిరునవ్వుతో కళ్ళు తెరిచేడు. "క్లాసికల్ మ్యూజిక్ అంటే మీకు యింట్రస్ట్ అనుకుంటాను" అంది లీల ముఖం చిట్లించి.

"ఏదో కొద్దిగా..." "కొద్దిగా ఏం కాదు, చాలా వున్నట్లుంది. కొంపతీసి మీకు సంగీతం ఒచ్చేంటి" ప్రసాద్ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. 'ఏవిటి వోకలా, ఇన్‌స్ట్రుమెంటా?" "ఫ్లూటు' "ఆదే అలా చెప్పండి... నాకీ క్లాసికల్ అంటే తలనొప్పి బాబూ" అంది ముఖం అదోలా పెడుతూ.

ప్రసాద్ లేచి బట్టలు దులుపుకున్నాడు. లీల ప్రసాద్‌కు చెయ్యందించింది. ప్రసాద్ ఆమె చెయ్యిపట్టుకుని లేవనెత్తేడు. ఆమె లేచి నిల్చునే సరికి ఆమె పైట పూర్తిగా జారిపోయింది. ప్రసాద్ తన దృష్టి ఆమె బిగువైన వక్షోజాల నుండి మరల్చలేక పోయేడు. లీల సిగ్గుతో తలవంచుకొని ప్రసాద్ చేయి విడిచి పైట సర్దుకుంది. "ఇప్పుడింకా సెవెనేగా అయింది. మా యింటికి రండి కాస్సేపు కూర్చుని వెళ్దురుగాని" అంది లీల. ప్రసాద్ కాదనలేక పోయేడు.

"రావోయ్? ప్రసాద్ రా! ఏమిటి మధ్య బొత్తిగా నల్లపూస వై పోయేవు కూర్చో"

అన్నారు భుజంగరావు నవ్వుతూ. "మీరు నాన్నగారితో మాట్లాడుతూండండి నేనిప్పుడే డ్రస్ మార్చుకొస్తా" అంటూ మేడ మీదకు వెళ్ళింది. "సీటుకు అప్లై చేసేవా" "లేదండీ" అదేమిటోయ్! టైమై పోతోంది ఇంకెప్పుడు అప్లై చేస్తావ్? అన్నారు ఆశ్చర్యంగా.

"చూడు ఫైనాన్సియల్‌గా హెల్ప్ ఏదైనా కావల్సి వస్తే చెప్పు మొహమాటపడకు ఎంతైనా సరే పర్వాలేదు నేసర్దుతా. "అబ్బే మీ దయవల్ల అటువంటిదేం లేదండీ" "మరీ...?" "ఏవిటో ఈ సంవత్సరం చదవాలని లేదు. నెక్స్టియర్ చూద్దామనుకుంటున్నాను" "నాకు తెల్సోయ్ నీమనస్సు ఏం బాగుండదని అయినా ఆలోచించుకో అనవసరంగా ఓ సంవత్సరం వేస్టవుతుంది" అన్నారు. "మిస్టర్ ప్రసాద్ మీకు కాఫీ కావాలా? డ్రింకా?" అంది లీల మేడ మెట్లు దిగుతూ.

"ఊc! శాంత పెళ్ళి విషయం ఏంటాలోచించావు సంబంధాలేవైనా చూస్తున్నావా? ఈ సంవత్సరం లోపలే చేస్తే మంచిదంటారు" అన్నారు. ప్రసాద్ అదిరిపడ్డాడు. భుజంగరావుగారి పైన కోపం వచ్చింది "వాళ్ళ నాన్న దాని పేర ఓపదివేలు బ్యాంకులో వేశాడు తెలుసా? అది పెట్టి ఎవడినైనా చూసి చేసెయ్యకూడదూ?" ప్రసాద్‌కు ఆయన మాటలు వింటూంటే చాల అసహ్యం వేసింది "ఆమె బరువు మీరేం మోయలేదుగా?" అందామనుకున్నాడు కాని ఆయనతో మాట్లాడాలనిపించలేదు. 'వస్తానండీ' అంటూ ఆయన సమాధానానికి ఎదురు చూడకుండా బయటకు వచ్చాడు.

శ్రీనివాస్‌గారు అతని భార్య సుగుణమ్మగారు, శాంత, నడివాకిట్లో కూర్చుని దేన్ని గురించో తీవ్రంగా చర్చిస్తున్నారు. ప్రసాద్ గుమ్మంలో అడుగు పెట్టగానే వాళ్ళ సంభాషణ ఆగిపోయింది. 'ఎప్పుడొచ్చేరు వూర్నుంచి" శ్రీనివాస్‌గార్ని అడిగేడు ప్రసాద్. "ఏదీ ఇప్పుడే అంతా ఒక గంటయింది" అన్నాడు చిరునవ్వుతో ఏవండోయ్ తమ్ముడుగారూ మీకోసం శాంత ట్రాన్సిస్టర్ తెప్పించింది చూసేరా" అంటూ శ్రీనివాస్‌గారి భార్య ప్రసాద్‌కు అందించింది. ప్రసాద్ అందుకొని చూసేడు "చాలా బావుంది మంచిసెట్టు! ఎంతయింది?"

శ్రీనివాస్‌గారు నాలుగు వేళ్లు చూపించేరు. 'ఏమిటో నర్రాయింత చిన్న డొక్కు నా ఒత్తుల పెట్టెంత లేదు. నాలుగొందలంటే నమ్మలేకుండా వున్నాను." అన్నారు సుందరమ్మ ముఖం అదోలా పెట్టి. "వీటి గురించి నీకు తెలియదు నువ్వూరుకో పిన్ని!" అంది శాంత కొంచెం కోపంగా. "అవున్లే నాకేం తెలుస్తుంది నేనిటువంటి వెప్పుడైనా చూసేనా చేసేనా?" అంటూ నవ్వుతూ చూసేరు సుందరమ్మగారు పదండి భోజనానికి వేళైంది అంటూ బయటకు దారితీసేరు.

వాళ్ళుముగ్గురూ వెళ్ళిపోగానే శాంత మెల్లగా అడుగులు వేసుకుంటూ ప్రసాద్ దగ్గరకు వచ్చింది. "అదికాదు బావా ఏం తోచటంలేదని అన్నయ్య ఊరుకెళుతూంటే తెమ్మన్నాను. మనకి నచ్చకపోతే రిటర్ను చేసెయ్యొచ్చుట" అంది జాలిగా ప్రసాద్ కళ్ళల్లోకి చూస్తూ. "పర్వాలేదు శాంత! నేనే యింకా తెప్పిద్దామనుకుంటున్నాను. మంచి పని చేసేవు" అన్నాడు ప్రసాద్. రాత్రి భోజనాలయ్యాక శ్రీనివాస్‌గారి భార్య వచ్చి ట్రాన్సిస్టరు తీసుకెళ్ళింది. సుందరమ్మగారు వింటారని. శాంత కూడా వెళ్ళింది. ప్రసాద్

మురళి తీసుకొని వాకిట్లో యీజీ ఛైర్లో కూర్చున్నాడు.

ఆరు మాసాలైంది తను మురళి ముట్టుకోలేదు వాయించబోతే వేళ్ళు కొంచెం తడబడ్డాయి. మెల్లగా "వాతాపిగణపతింభజే" అంటూ గణపతి ప్రార్థన ప్రారంభించేడు అతనికి తెలియని ఆవేశంతో ఇంచు మించు అరగంట సేపు వాయించేడు. పడపడమని చప్పట్ల చప్పుడు విని గతుక్కుమని కళ్ళుతెరిచేడు ఎదురుగా శ్రీనివాస్‌గారు సుందరమ్మగారు శాంత యింకా ఇరుగు పొరుగు వాళ్ళు పది మంది వరకు నిశ్శబ్దంగా కూర్చున్నారు.

వెరీనైస్ బావా! చక్కగా వాయించేవు! నీకింతలా... అంటూ ప్రసాద్ షేకెండిచ్చేరు. "సరస్వతీ పీఠంరా మరే వనుకున్నావ్! ఇంతకూ మాశాంత అదృష్టవంతురాలు... నే బ్రతికుండగానే ఆ మూడు ముళ్ళు పడిపోతే! అంటూ శాంత తల నిమిరారు సుందరమ్మగారు. ప్రసాద్ అదిరి పడ్డాడు. శాంత సిగ్గుతో తల వంచుకుంది. "యిప్పుడే యింత సిగ్గయితే ... రేప్పొద్దుట అంటూ ఏమో అనబోయేరు సుందరమ్మగారు.

"నువ్వూరుకో అమ్మా! నీకు వేళాపాళా అక్కర్లేదు. ఎది బావా! ఆ చేత్తోటే మరొక్క కీర్తన ప్లీజ్?" అన్నారు శ్రీనివాస్‌గారు. ప్రసాద్ కాదనలేకపోయేడు. ఓ రెండు అష్టపదులు వాయించేడు. వాళ్ళు వెళ్ళిపోగానే శాంత వీధితలుపు గడియ వేసి వచ్చి ప్రసాద్ కాళ్ళ దగ్గర కూర్చుంది "బావా....!" "ఏంటి శాంతా! చెప్పు పర్వాలేదు" అన్నాడు. "బావా! నీమీదే ఆశలు పెట్టుకున్నాను. నన్నన్యాయం చేయకు...' ఆమె గొంతుకు బొంగురు పోయింది. నోటంట మాట రాలేదు. ప్రసాద్ ఒడిలో తల పెట్టుకుంది కళ్ళు చెమ్మగిల్లేయి.

"ఛా! ఏమిటది శాంతా లేలే! అయినా నువ్వెందుకలా అనుకుంటున్నావు!" అన్నాడు ప్రసాద్ ఆమె గడ్డం క్రింద చేయి పెట్టి పైకెత్తుతూ శాంత మాట్లాడలేదు పైట కొంగుతో కళ్ళు ఒత్తుకుంది. "ఏడుస్తున్నావా! చా! చా! ఆరోజు మామయ్య కేమని వాగ్దానం చేసేనో జ్ఞాపకముందిగా, అనవసరంగా నీ మనస్సు పాడుచేసుకోక లేచి వెళ్ళి పడుకో హలా రాత్రి అయింది' అంటూ ఆమెను పంపించి తన గదిలోకి వెళ్ళి పడుక్కున్నాడు. మంచం మీద చాలాసేపు దొర్లేడు కాని నిద్రరాలేదు.

"శ్యామల తనగురించేమనుకుంటోందో? నమ్మించి ద్రోహం చేసేడు దుర్మార్గుడు! ద్రోహి అనుకుంటుంది కాని తనేం చేయగలడు విషమ పరిస్థితిలో వున్నాడు. అటు శ్యామల యిటు శాంత. ఈ యిద్దర్లో ఎవర్ని కాదనాలి? శాంత చాల అమాయకురాలు తన మీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. అనాధ. పాపం తండ్రి పోయిన దుఃఖంతో కుమిలిపోతోంది తను కాదంటే...? ప్రసాద్ మనస్సు పరిపరి విధాలపోతోంది. ఈ ఆలోచనల్తో తల పగిలిపోతుందేమోనని భయపడ్డాడు కూడా "ఏం బావా! నిద్రరాలేదూ" అంటూ చిరు నవ్వుతో ప్రవేశించింది శాంత. ప్రసాద్ తల అడ్డంగా త్రిప్పేడు.

"ఏం జోలపాడి జోకొట్టేదా" కిల కిలా నవ్వింది. "అంత భాగ్యమా" అంటూ ప్రసాద్ మంచం దిగి శాంత నడుం చుట్టూ చేతులు పోనిచ్చి తన దగ్గరకు తీసుకున్నాడు. "బావా! బావా!" అంది శాంత కంగారుగా. ప్రసాద్ తన తప్పును తెల్సుకుని చట్టుక్కున శాంతను విడిచిపెట్టేడు. "లైటార్పి పడుకో బావా! త్వరగా నిద్రవస్తుంది" అంటూ తన గదిలోకి

వెళ్ళిపోయింది శాంత.

మర్నాడు సాయంత్రం బజార్లో - "రావోయ్ బావా! యిన్ని సోడా నీళ్ళు త్రాగుదాం గొంతు కెండిపోతోంది" అన్నారు శ్రీనివాస్‌గారు కిళ్ళీ దుకాణం వేపు దారితీస్తూ. ప్రసాద్ దుకాణం వాడిచ్చిన సోడాకాయి అందుకున్నాడు. అటుగావస్తున్న లీల ప్రసాద్‌ను చూసింది. "హల్లో మిస్టర్ ప్రసాద్....." అని ఏమో చెప్పబోయి శ్రీనివాస్‌గార్ని చూసి ఆగి గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోయింది లీల. ప్రసాద్ ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యపోయేడు. ఆమె వెళ్ళిన వేపుచూస్తూ నిల్చుండిపోయేడు. శ్రీనివాస్‌గారు చిరునవ్వు నవ్వుకున్నారు. ప్రసాద్ చేతిలోంచి సోడాకాయి తీసుకొని దుకాణదారుడికిచ్చి.

"యిందులో గ్యాస్ పోయింది మరొకటి" మ్మన్నారు "ఇలా షోకులు చెలాయించే తల్లీ తండ్రిని వూళ్ళో తలెత్తుకొని తిరగలేకుండా చేసింది" అన్నారు శ్రీనివాస్‌గారు. "ఎవరు, లీలా?" అన్నాడు ప్రసాద్ ఆశ్చర్యపోతూ. "ఆఁ! లీలే! ఈవిడేదో చదివి వెలగాపెడుతూందని కాలేజీలో జాయిన్ చేసేరు. ఎవడో నీచుడు ఈవిడిగారి షోకులు, అందచందం చూసి లేనిపోని ఆశలు కల్పించి వశం చేసుకున్నాడు రోగ్! ఫలితం వెంటనే కన్పించి వూరంతా గుప్‌మంది. ఎలాగో ఆపీడ వదిలించుకొని కాలేజి మాన్పించి తీసుకొచ్చేరు. పెళ్ళి చెయ్యాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కాని ఈవిడ చరిత్ర తెలిసిన వాళ్ళెవరూ ముందుకు రావడంలేదు"

శ్రీనివాస్‌గారి మాటలు వింటూంటే ప్రసాదుకు తల తిరిగిపోతోంది. ఒక్కొక్కమాట వాడి శూలాల్లా హృదయంలో గుచ్చుకున్నట్లైంది. ".తను శ్యామలకు ఎంత ద్రోహం చేస్తున్నాడు. దేవునిపై ప్రమాణం చేసి ఆమెను వప్పించేడు కాని కాని..." ప్రసాద్ తొందరగా యింటికి వెళ్ళి తల పట్టుకొని ఈజీ ఛెయిర్లో పడుక్కున్నాడు. శ్రీనివాస్‌గారి మాటలు పదే పదే ప్రసాదు చెవుల్లో గింగురుమంటున్నాయి. "ఏం బావా తలనొప్పిగా వుందా?" అంటూ నుదుటి మీద చేయివేసి చూసింది శాంత "అబ్బ! నుదురు ఎంత వేడిగా వుందో. ఉండు బావా కొంచెం అమృతాంజనం రాస్తాను" అంటూ అమృతాంజనం సీసా తెచ్చింది. "మరేంపర్వాలేదు శాంత" అంటూ ఆమెను వారించబోయేడు. కాని శాంత వినకుండా అమృతాంజనం నుదుటికి కణతలకు రాసింది.

★ ★ ★

"మా అమ్మాయి శ్యామల మెడిసిన్ చదువుతూంది. వీరు మూర్తిగారని మన బంధువులే. మన వూళ్లో బిజినెస్ చెయ్యడాని కొచ్చేరు. వీరి ఫాదర్ నేను చిన్నప్పుడు కల్సి చదువుకున్నాం" అంటూ అప్పుడే కాలేజీ నుంచి వస్తున్న తన కూతుర్ని పరిచయం చేసేరు మూర్తిగారికి రామశర్మగారు. "గ్లాడ్ టు మీట్‌యూ" అంటూ మూర్తి చేయి ముందు జాపేడు. కాని శ్యామల "నమస్తే" అనడంతో ముఖం చిట్లించేడు తను కూడ 'నమస్తే' అన్నాడు. సూటు, బూటూ, బొౌ వేసుకొని విలాసంగా సిగరెట్ కాలుస్తున్న మూర్తిని ఒక మారు చూసి మేడ మీదకు వెళ్ళిపోయింది శ్యామల.

★ ★ ★

మర్నాడు సాయంత్రం శ్యామల కాలేజీ గేటు దాటి బయటకు వచ్చే సరికి "హల్లో శ్యామల! గుడ్ యీవినింగ్!" అన్న మాటలకు ప్రక్కకు తిరిగి చూసింది. "ఇంటికే కదా! కమాన్ డ్రాప్ చేస్తా" అంటూ చిరునవ్వుతో కారు ఫ్రంట్ సీటు తలుపు తెరిచేడు. శ్యామల సందిగ్ధంలో పడింది. వెళ్ళడమా మానడమా? ఒక్క క్షణం ఆలోచించి బేక్ సీట్ తలుపు తెరిచి కూర్చుంది. మూర్తి ఒక్క మారు భుజాలెగరేసి కారు స్టార్ట్ చేసేడు. "ఎల్లా వున్నాయి డాక్టరమ్మగారి స్టడీస్" అన్నాడు కొంచెం గొంతుక సవరించు కొని, శ్యామల అతని ప్రశ్న విననట్లే వూరుకుంది.

"కొంచెం కాఫీ తీసుకొని వెళ్దాం" అంటూ కారు స్లో చేసేడు కాఫీ హొటల్ దగ్గర. "నో థాంక్స్ మీరు కావలిస్తే వెళ్ళి తీసుకోండి నేను యిక్కడదిగి యింటికి కెళ్ళి పోతాను. నాకొ్కంచెం అర్జంటుపనుంది యింటి దగ్గర" అంది శ్యామల. మూర్తి మరేం మాట్లాడకుండా కారు నేరుగా శ్యామల యింటి ముందుకు పోనిచ్చేడు. శ్యామల కారు దిగి అతని వేపైనా చూడకుండా చరచర నడుచుకుంటూ యింట్లోకి వెళ్ళిపోయింది.

★ ★ ★

"బావా మా స్కూల్లో సైన్సు అసిస్టెంటు పోస్టు కాళీగా వుంది జాయిన్ అవకూడదూ అన్నారు శ్రీనివాస్‌గారు. "నేనా...?!" అన్నాడు ఆశ్చర్యంగా. "అవునోయ్ కాస్త కాల క్షేపంగా వుంటుంది ఆలోచించుకో". ప్రసాద్ శాంత వేపు చూసేడు. "అవును బావా! అన్నయ్య చెప్పింది బాగానే వుంది సబ్జెక్ట్ కూడ టచ్‌లో వుంటుంది" అంది శాంత.

★ ★ ★

శ్యామల మంచం మీద వెల్లకిలా పడుక్కొని ప్రసాద్ ఫోటో పట్టుకొని దీర్ఘంగా ఆలోచిస్తూంటే తలుపు తెరిచిన చప్పుడుకు అదిరిపడి లేచింది. కనీసం 'లోపలకు రావచ్చా?' అనేనా అడక్కుండా చిరునవ్వుతో తన గదిలో ప్రవేశించిన మూర్తిని చూడగానే శ్యామలకు ఒళ్లు మండింది "నాన్నగారి కోసమా?" అంది కోపంగా "నీ కోసమే వచ్చాననుకోకూడదూ" అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ. "ఎవరిదా ఫోటో అంతలా నలిపేస్తున్నావ్". "మిస్టర్ మూర్తి దయచేసి ముందు బయటకు నడవండి అధిక ప్రసంగం కట్టి పెట్టి"

"చూడు శ్యామల...." అంటూ యింకా ఏమో చెప్పబోయేడు. కాని శ్యామల అతని మాట వినిపించుకోకుండా బయటకు రాబోయింది మూర్తి చటుక్కున శ్యామల చేయి పట్టుకొని తన మీదకు లాక్కున్నాడు. శ్యామల తన చేతిలో వున్న ఫోటోతో మూర్తి ముఖం మీద బలంగా కొట్టింది. ఫోటో ఫ్రేం అంచు నుదుటికి తగిలి నుదురు చిట్లింది. 'అబ్బా' అంటూ ఆమె చేయి విడిచేడు.... శ్యామల ఒక్క పరుగున మేడ దిగి క్రిందకు వెళ్లి పోయింది.

మూర్తి ప్రతి రోజు రామశర్మగారింటికి వచ్చి కొంత సేపు కూర్చుని వెళ్తున్నాడు. ఓ రోజు రాత్రి భోజనాల దగ్గర రామశర్మగారు శ్యామలను అడిగేరు 'మూర్తి గురించి నీ అభిప్రాయమేంటమ్మా' అని. "అంటే...." అంది అర్థంకాక. "అదికాదమ్మా! కుర్రాడు

మంచివాడు, బుద్ధిమంతుడు, మనకు కావల్సినవాడు. అందుకని నువ్విష్టపడితే...' "నాన్నా!" గట్టిగా అరిచింది. "నావుద్దేశం మీకిదివరకే చెప్పాను నేను ప్రసాద్‌ని తప్ప...." "చెప్పకుండా చెయ్యకుండా పత్తాలేక పరారైన వాడ్ని గురించి పలవరిస్తావేంటమ్మా.... అతనింక తిరిగి రాకుంటే...." అన్నారు. కోపంగా.

'అది నాఖర్మని నేను జీవితాంతం యిలానే వుండి పోతా" శ్యామలకు ఎక్కడ లేని దుఃఖం వచ్చింది. తింటున్న అన్నంలో చేయి కడుక్కోని లేచి వెళ్ళిపోయింది. తన గదిలో మంచం మీద బోర్లాపడుక్కొని చాలసేపు ఏడ్చింది. రామ శర్మగారు కూతురి ప్రవర్తనకు నిర్ఘాంతపోయేరు. లేచి మెల్లిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి కూతురు మంచం మీద కూర్చున్నారు.

"అమ్మా! శ్యామల! నీ మనస్సు తెల్సి వుండి కూడా స్వార్థంలో ఆవేశంలో ఏమో అన్నా నమ్మా! నన్ను....క్షమించవూ?" అంటూ కూతురి తల నిమిరారు నాన్నా! అంటూ తండ్రి హృదయం మీద తల పెట్టుకొని బావురుమంది. "ప్రసాద్ తప్పకుండా వస్తారు నాన్నా ఆయన అలాంటి వారు కాదు మోసగించరు." "అవునమ్మా! తప్పకుండా వస్తాడు. ఇక మీదట నీమనస్సెప్పుడూ కష్టపెట్టనుగా ప్రామిస్ చేసి చెప్తున్నా!" ఆయన గొంతుక బొంగురు పోయింది.

★ ★ ★

శ్రీనివాస్‌గారు సుందరమ్మగారు పట్టు పట్టే శాంత ప్రసాద్‌ల వివాహం నిర్విఘ్నంగా జరిపించేరు. పెళ్ళయిన తరువాత శాంత ప్రసాద్‌ని ఎం.ఎస్.సి. చదవమని బలవంతం చేసింది. ప్రసాద్ ఆమె మాట కాదనలేక యూనివర్సిటీలో జాయిన్ అయ్యాడు. కాని నెల రోజులు తిరక్కుండానే ప్రసాద్‌కు పెద్ద జబ్బు చేసింది. శాంత శ్రీనివాస్‌గార్కి కబురంపి రప్పించింది. ఆయన ప్రసాద్ పరిస్థితికి చాల కంగారు పడ్డారు. బ్రతుకుతాడనే ఆశకూడ కన్పించ లేదు. శాంత శుశ్రూషవల్ల ప్రసాద్ మళ్లీ మూడు నెల తరువాత బ్రతికి బయట పడ్డాడు.

డాక్టరు, ప్రసాద్‌కు గాలి మార్పు విశ్రాంతి అవసరం అనడం వల్ల చదువుకు పూర్తిగా స్వస్తి చెప్పేడు. శ్రీనివాస్ గారు ప్రసాద్‌ని ఇంటికి తిరిగి వచ్చేయమని బలవంతం చేసి తీసుకెళ్ళిపోయేరు. ప్రసాద్ కొంత కాలం విశ్రాంతి తీసుకొన్నాడు. ఆరోగ్యం, పూర్తిగా చక్కబడిన తరువాత చాల చోట్ల చాల వుద్యోగాలు చేసేడు, గత ఎనిమిదేండ్లలో కాని ఏ వుద్యోగం అతనికి సరిపడలేదు చివరకు నెల రోజుల క్రితం మ్యూజిక్ కాలేజీలో లెక్చరర్‌గా చేరేడు.

శ్యామల ఎం.బి.బి.యస్ పూర్తి చేసి హౌస్ సర్జను చేస్తుండగా రామశర్మగారు కాలం చేసేరు. అయినా శ్యామల గుండె నిబ్బరంతో హౌస్ సర్జన్ పూర్తి చేసి ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టింది. రెండు సంవత్సరాల్లో మంచి పేరు సంపాదించి నర్సింగ్ హోమ్ కట్టించింది. దానికి ప్రసాద్ పేరే పెట్టింది.

★ ★ ★

"ఎవరు తాతా!?" అంది డాక్టర్ శ్యామల బద్దకంగా ఒళ్లు విరుచుకుంటూ. "ఆఁఎవరోనమ్మా డెలివరీ కేసట. యీళ్ళకి ఏళాపాళా లేదు అద్దరాత్తిరప్పుడు వూరకనే గోలెడతారు" అంటూ చీదరించుకున్నాడు బంగారం లాంటి నిద్దర పాడయిందని. "డెలివరీ కేసుకి వేళాపాళా వుంటుందా! ఆయన్ని లోపకి కొచ్చి కూర్చోమను నేనిప్పుడే వసా' తాత మరేం మాట్లాడ కుండా తలుపు తీసి ఆయనకు కుర్చీ చూపించేడు.

మాసిన గడ్డం, రేగిన జుత్తు, నలిగిన పై జామా, షర్టుతో ప్రసాద్ నీరసంగా అడుగులు వేసుకుంటూ వచ్చి తాత చూపించిన కుర్చీలో కూర్చున్నాడు. ఒక మారు హాలంతా పరికించి మేడ మెట్లు వేపు దృష్టినిల్పి డాక్టరు రాకకై ఎదురు చూస్తున్నాడు. డాక్టరు శ్యామల తలవంచుకొని చకచకా మేడ మెట్లు దిగి ఆఖరి మెట్టు మీద నిలబడి తలెత్తి ప్రసాద్‌ని చూసింది. ప్రసాద్ లేచి నిల్చుని చేతులు జోడించి "నమస్తే" చెప్పాలను కున్నాడు. శ్యామల ముఖం చూడగానే అతని అవయవాలన్నీ స్వాధీనం తప్పాయి. నోటంట మాటరాలేదు. ప్రతిమలా నిల్చుండి పోయేడు

ప్రసాద్? ఆకస్మికంగా చూసిన శ్యామల పరిస్థితి గూడా యించు మించు అల్లానే వుంది. ఏ వ్యక్తికోసమైతే తను గత పదేళ్ళ నుంచీ అహోరాత్రులు పరితపించిందో ఆ వ్యక్తిని అకస్మాత్‌గా చూడ్డంతో శ్యామల నోటంట మాట రాలేదు. ఆమె చేతిలో వున్న స్టెతస్కోపు జారి క్రింద పడింది క్షణకాలం స్తంభించినట్లు నిల్చుంది. కాని కర్తవ్యం వెన్నుచరిస్తే మళ్ళీ యీలోకంలోకి వచ్చింది. క్రింద పడ్డ స్టెతస్కోపు తీసి చేత్తో పట్టుకుంది.

"డెలివరీ కేసా" అంది వణుకుతున్న గొంతుకతో ఏం మాట్లాడాలో తెలియక. ప్రసాద్ అవునన్నట్లు తలూపేడు. తాతా! నాబేగ్ తీసుకెళ్ళి కారులో వుంచు అంది. 'ప్రసాద్ రండి మనం వెళ్దాం" అంటూ బయటకు నడిచింది. "అమ్మా నర్సమ్మను కేకెయ్యనా?" అన్నాడు తాత బేగ్ కారులో వుంచుతూ. "వద్దులే అవసరముంటే తరువాత కబురు పంపుతా" "మరి డ్రైవరో?" అన్నాడు సందేహంగా. "ఎవరూ వద్దు మరేం పర్వాలేదు. నువ్వు లోపలికెళ్ళి తలుపు వేసుకో" అంటూ కారు తలుపు తీసి ప్రసాద్‌ను కూర్చోమని తను కారు స్టార్ట్ చేసింది.

ఆరోజు శ్యామల ప్రవర్తన తాతకు చాల ఆశ్చర్యం కల్గించింది. తను గత నాలుగు ఏళ్ళ నుంచీ ఆమెవద్ద పని చేస్తున్నాడు. ఈ నాలుగేళ్లలోను ఆమె రాత్రి పూట ఏ కేసు చూడ్డానికైనా వంటరిగా పోలేదు. వెంట నర్సుని కాని డ్రైవర్ని కాని తీసుకెళ్లేది. "ప్రసాద్ మీకు ఈ అభాగిని జ్ఞాపకముందా?" అంది శ్యామల వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ. ప్రసాద్‌కు ఎవరో చెంపమీద కొట్టినట్లయింది. "శ్యామల ప్లీజ్ రేపుదయం అంతా చెప్తాను" అన్నాడు నీర్సంగా. శ్యామల మౌనంగా కారు డ్రైవ్ చేసింది ప్రసాద్ చెప్పిన గుర్తుల ననుసరించి.

"ప్రసాద్ యీమే చాలా వీగ్గా వున్నారు. ఇప్పుడే ఇంజక్షను యిచ్చేను ఇక్కఢ కంటే నర్సింగ్ హొమ్‌కు తీసుకెళ్తే మంచిది. కొంచం జాగ్రత్తగా పట్టుకోండి తీసుకెళ్దాం" అంటూ శాంతని మెల్లగా కారు బేకు సీట్లో పడుక్కోపెట్టి శ్యామల యింటికి తీసుకెళ్లింది. ఇంటికి

చేరగానే తాతను పిల్చి నర్సును పిల్చుకు రమ్మంది.

శాంత గదిలో ప్రసవ వేదన అనుభవిస్తోంది. గది బయట ప్రసాద్ కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ప్రక్కనే తాత చేతులు కట్టుకొని నిల్చున్నాడు. ప్రసాద్‌ని పలకరిద్దామని ఒకటి రెండు పర్యాయాలనుకున్నాడు కాని లాభం లేదని వూరుకున్నాడు గదిలోంచి కెవ్‌మని పసికందు ఏడుపు వినిపించగానే ప్రసాద్ లేచి నిల్చున్నాడు ఆతృతగా.

"ప్రసాద్ కాంగ్రాచ్యులేషన్స్ ఆడపిల్ల" అంటూ శ్యామల కొద్దిగా తలుపు తెరిచి చెప్పి మళ్లీ తలుపు మూసింది "లచ్మీ దేవి బాబూ మీకేటి యిసారం నేదు" అన్నాడు తాత. ప్రసాద్ నీరసంగా కుర్చీలో మళ్ళీ కూలబడ్డాడు. పావుగంట నిశ్శబ్దంగా గడిచింది "ఇంక మీరు వచ్చి చూడవచ్చు" అంది నర్స్ తలుపు తెరుస్తూ.

ప్రసాద్ గబగబా లోపలికెళ్ళేడు కళ్ళు మూసుకొని నిశ్చింతగా పడుక్కున్న శాంతను ఆమె ప్రక్కలో వున్న బిడ్డను చూసేడు . డాక్టరు శ్యామల వేపు కృతజ్ఞతతో చూసి శాంత నుదుటి మీద చెయ్యి వెయ్యబోయేడు. శ్యామల అతని చేతిని మధ్యలోనే పట్టుకొని ఆపింది. "ప్రసాద్ ఆమెకు విశ్రాంతి అవుసరం డిస్టర్బ్ చెయ్యకండి ప్లీజ్" అంది.

ప్రసాద్ శుభవార్తను శ్రీనివాస్‌గార్కి తెలియజేసేడు. తనకు పునర్జన్మ కల్గించి గత 15 రోజుల నుంచీ ఎంతో ఆదరాభిమానాలతో చూస్తున్న డాక్టరు శ్యామల గార్కి ఎన్నో పర్యాయాలు తన ధన్యవాదాలు చెప్పింది శాంత. డాక్టర్ శ్యామల తన కూతుర్ని క్షణకాలమైన విడవకుండా అన్ని సంరక్షణలూ చెయ్యడం చూసి ఎంతో ఆశ్చర్యపోయింది కూడ. అంతే కాకుండా ప్రసాద్‌లో చాలా మార్పు గమనించింది. అతను ఇప్పుడు ఎంతో వుత్సాహంగా వుంటున్నాడు.

"ఎప్పుడు నన్ను రిలీవ్ చేస్తారో డాక్టర్‌గార్ని అడిగేరా?" అంది భర్తతో శాంత ఓరోజు. ప్రసాద్ సమాధానంగా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. పోనీ అతను ఎందుచేతనో మొహమాట పడుతున్నట్లున్నాడు తనే ఈ విషయం డాక్టర్‌గార్ని అడగాలనుకుంది. శాంత ఓరోజు వుదయం నర్స్‌ని పిల్చి "డాక్టరమ్మగా రెక్కడున్నారని" అడిగింది.

"ఏం అమ్మా! పిలవమంటారా?" అంది నర్సు "వద్దు కానీ ఒక్క అయిదు నిముషాలు పాపని చూస్తుండు నేను డాక్టరమ్మగారి దగ్గరకు వెళ్ళివస్తానని" చెప్పింది మేడ మెట్ల దగ్గర తాత ఎదురయ్యాడు. " డాక్టరమ్మగార్ని చూడాలి వెళ్లొచ్చా" అని అడిగింది. "ఎల్లండమ్మా మీకడ్డేటి" అన్నాడు తాత నవ్వుతూ. శాంత మెల్లగా మేడెక్కి డాక్టర్ శ్యామల గదిలో అడుగు పెట్టింది

"వద్దు ప్రసాద్ వద్దు! మీరు నన్ను విడిచి ఎక్కడకూ వెళ్లొద్దు. నా ఆస్తంతా మీ పేరనే రిజిష్టరు చేయించేను. మీరు నా చెంత నుంటే చాలు. అంతకన్నా మిమ్మల్నేం కోరను. మీ సుఖానికి నేనెప్పుడూ అడ్డు రాను...." డాక్టర్ శ్యామల తన భర్త గుండెల మీద తల పెట్టుకొని దుఃఖిస్తున్న దృశ్యం చూసి తల తిరిగి పడిపోయింది శ్యామల.

ప్రసాద్, శ్యామల ఒక్క దూకులో వెళ్ళి ఆమెను పట్టుకున్నారు. మెల్లగా తీసుకొచ్చి

మంచం మీద పడుక్కో పెట్టేరు. కూజాలోని చల్లని నీరు శాంత ముఖం మీద జల్లి పల్సు బి.పి. చూసింది శ్యామల. శాంత మెల్లగా కళ్లు తెరిచింది. "మీ జీవితాన్ని నామూలంగా పాడుచేసేనేమో!" అంటూ మంచంమీద లేచి కూర్చుంది. "ఏంటి శాంత యిది" అంటూ గట్టిగా కోప్పడింది డాక్టర్ శ్యామల.

"అవునమ్మా! నా స్వార్థం కోసం ఆయన్ని మీ నుంచి దూరం చేసేను... మొదటే ఈ విషయం తెల్సుకోలేకపోయేను. మాకు పెళ్ళయిన నెల రోజులకే ఆయనకు పెద్ద జబ్బు చేసింది. వాళ్లు తెలియనిస్థితిలో వారు రోజా శ్యామలా.... నీకిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయాను.... అందుకే భగవంతుడు నన్ను బలవంతంగా తీసుకెళ్తున్నాడు" అంటూ పలవరించేవారు.

"వారి హృదయాన్ని అంతలా ఆకర్షించిన ఆ దేవతా మూర్తిని ఈనాడు ప్రత్యక్షంగా చూసేను. అక్కయ్యా! నన్ను క్షమించవూ" అంటూ డాక్టర్ శ్యామల పాదాల మీద పడింది శాంత. "చెల్లీ లేలే! ఏమిటిది? నీ మూలంగా వార్ని మళ్ళీ చూడగలిగేను. నా ఆశాజ్యోతిని వెలబెట్టిన పుణ్యాత్మురాలివి నువ్వు" అంటూ లేవనెత్తి తన హృదయానికి హత్తుకుంది డాక్టర్ శ్యామల.

'ప్రజారథం', 1970